

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు :వెంకటేశ్వరపురం జనార్దన్ రెడ్డి కాలనీ మసీదు సెంటర్ నందు గల సాయినాథ్ హెల్త్ కేర్ సెంటర్ లో శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన కనిపించింది. ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కె. చిరంజీవి చిన్న పిల్లలు పురిటి పిల్లల వైద్య నిపుణులు .డాక్టర్ కె కళ్యాణి శ్వాసకోశ వ్యాధుల నిపుణులు వైద్యసేవలందించారు. ఉచిత వైద్య శిబిరాలను పేద మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని నారాయణ హాస్పిటల్స్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నరసాపురం ప్రసాద్ .డాక్టర్ ఆయేషా .విఆర్వో కుమార్ ఉన్నారు.

ఇదేనా 'ఫ్రెండ్లీ' పోలీసింగ్..!

పోలీసుల తీరు మారుతోంది..ఒకప్పుడు ఏ చిన్నకష్టమొచ్చినా పోలీసు స్టేషన్‌కు వెళ్లే జనం ఇప్పుడు రాజకీయపార్టీల నేతల చుట్టూ తిరుగుతున్నారు. అధికారపార్టీ నేతల ఆదేశాలు లేకుండా చిన్నపని కూడా స్టేషన్‌ల్లో జరగడం లేదు. మరోవైపు ఆర్థికపరమైన వ్యవహారాల్లో పోలీసులు న్యాయం, చట్టం పరిధిలో కాకుండా తమను అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అమాయకులపై ప్రతాపం చూపుతూ.. పెద్దలకు గులాం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఫ్రెండ్లీ పోలీసింగ్ చేయండి.. అంటూ ఆదేశాలు జారీ చేసినా కింది స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వరుస సంఘటనలు దీనికి అద్దంపడుతున్నాయి. వరికుంటపాడు ఎస్ఐ గిరిజన యువకుడిని వేధించిన కేసులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నాం చేశాడు. అస్సాం యువకుడి అనుమానాస్పద మృతితో ఎనిమిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

- అస్సాం యువకుని మృతిలో అనుమానం
- ఎస్ఐ వేధింపులకు గిరిజనుడు ఆత్మహత్యాయత్నం
- పోలీసులపై క్రమశిక్షణా చర్యలు

గంగాధర్‌రావు సిఐ వెంకటాచలం

విజయ్ శ్రీనివాస్, వరికుంటపాడు ఎస్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రశాంతతకు నిలమమైన నెల్లూరు జిల్లాలో పోలీసుల తీరు ప్రజల్లో భయందోళన కలిగిస్తున్నాయి. గుండాలు,రౌడీలు, అల్లరి మూకలు, మద్యం బాబులు, దొంగలు, దోపిడీదారులు, బ్లేడ్ బ్యాచ్‌లు రోజు రోజుకు ఎక్కువైపోతున్నారు. ఒకప్పుడు పోలీసులను చూసి భయపడే వ్యక్తులు ఇప్పుడు పోలీ సులకు ఎదురుగా నిలుస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం అధికారపార్టీనేతల పోత్సహంగానే కనిపిస్తుంది.నేరస్థుడిని స్టేషన్‌కు తీసుకెళ్లిన వెంటనే తమ వాడేనంటూ సిఫార్సులు వస్తుండడంతో వదిలేసి మౌనంగా ఉంటున్నారు. ఇలాంటి సమయంలో ఆర్థికంగా ఉపయోగపడే కేసులపైనే ఎక్కువ దృష్టిపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు పదే పదే మీటింగ్‌లు పెట్టి చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. ఇటీవల జిల్లాలో జరుగుతోన్న సంఘటనలను పోలీసులకు సవాల్‌గా మారుతు న్నాయి. పడారుపల్లిలో తొమిది మంది అకతాయిలు ఒక అమ్మాయిపై అత్యాచారం చేశారు. కందుకూరులో ముగ్గరు వ్యక్తులు వివాహితపై అత్యాచారయత్నం చేశారు. ఇవన్నీ ఒకటైతే సమాజంలో జరుగుతోన్న అనేక సంఘటనల్లో చొరవచూపని పోలీసులు పేద, అమాయక ప్రజలపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారు. ఈనెల 16న అస్సాం రాష్ట్రానికి చెందిన కుక్కీస్ తెగకు చెందిన గిరిజనుడు ఇమ్మానియేల్ అనే వ్యక్తి వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో ఘర్షణ పడ్డారు. ఆయనను వెంకటాచలం పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆ తర్వాత బుజబుజ నెల్లూరు వద్ద అనుమానాస్పదంగా మృతి చెందారు. అస్సాంలోని కుక్కి తెగకు చెందిన వ్యక్తి కావడం, ప్రస్తుతం మణిపూర్‌లో అల్లర్ల నేపథ్యంలో అక్కడ మృతిని బంధువులు ఆందోళనకు దిగారు. అస్సాం రాష్ట్ర ప్రభుత్వం ఎపి ప్రభుత్వానికి ఈ కేసును పరిశీలించాలని కోరింది. డిజిపి ఆదేశాలతో గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజ్ విచారణ చేపట్టారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇస్మానియల్ మృతి చెందారని నివేదిక ఇచ్చారు. ఉన్నతాధికారులు పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారు. వెంకటాచలం సిఐ గంగాధర్, ఎస్ఐ శ్రీనాథ్, కానిస్టేబుల్ లక్ష్మీకాంత్‌లను సస్పెండ్ చేశారు. ఎస్ఐ అయ్యప్ప, కానిస్టేబుల్ నాగేంద్ర, మధన్, హెూంగార్డులు ఏ. మధు, మధుసూధన్ విఆర్‌కు పంపారు.

నెల్లూరులో చికిత్సపొందుతున్న రవి

ఎస్ఐ వేధింపులకు గిరిజనుడు ఆత్మహత్యాయత్నం...!

వరికుంటపాడు ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ వేధింపుల కారణం గా గిరిజన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వరికుంటపాడు కి చెందిన ఇండ్ల రవి సెల్ఫీ వీడియో చేసి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వరికుంటపాడు ఎస్ఐ వేరే మండలం లో పని చేస్తున్నప్పుడు ఇండ్ల రవి అక్కడ ఉంటున్న సమయంలో కేసు పెట్టడం జరిగిందని, ప్రస్తుతం వరికుంటపాడు మండలానికి వచ్చిన తర్వాత కూడా అదే వేధింపు ధోరణి తో వ్యవహరించాడని, సస్పెక్టడ్ షీట్ ఎత్తి వేయాలని ప్రాధేయ పడగా ఎస్ఐ లక్ష రూపాయలు డిమాండ్ చేశాడని, అందుకు తాను 70, 000 రూపాయలు చెల్లించినట్లు వీడియో సందేశంలో పేర్కొన్నాడు. మళ్లీ మిగతా రూ. 30 వేలు చెల్లించాలని డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. కౌలు భూమిని సాగు చేస్తున్నా ఇబ్బందులు పెట్టాడని, నిత్యం కులం పేరుతో దూషిస్తూఉండేవాడని, అందుకే ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధం అయినట్టు తెలిపి, పురుగుల మందు తాగి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరి అపస్మారక స్థితిలో పడి పోయాడు. పరిస్థితి గమనిం చిన హెడ్ కానిస్టేబుల్ నారాయణ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి ప్రకాశం జిల్లా పామూరుకు తరలించాడు. ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారడం తో నెల్లూరు రామచంద్రా రెడ్డి ఆస్పత్రి లో చికిత్స చేయిస్తున్నాడు. ఉదయగిరి సిఐ గిరిబాబు నెల్లూరు వెళ్లి వాస్తవ పరిస్థితులు తెలుసుకుం టున్నాడు. ఈ సంఘటన పై వరికుంటపాడు ఎస్ఐ తీరు పై కూడా పలు విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గిరిజన యువకుడి నుంచి రూ. లక్ష డిమాండ్ చేయడం , ఆయన ఈ స్థితికి కారణంగా చెబుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

అస్సాం వాసి మృతి ఘటనలో
పోలీసులపై చర్యలు
సిఐ సస్పెన్షన్ -ఏడుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో అస్సాం రాష్ట్రానికి చెందిన కుక్కీస్ తెగకు చెందిన గిరిజనుడు ఇమ్మానియేల్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి వెంకటాచలం పోలీస్టేషన్‌కు చెందిన మొత్త ఏడుగురు సిబ్బందిపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఆ వ్యక్తి మృతి చెందారన్న కారణంగా సిఐ గంగాధర్‌రావు, ఎఎస్ఐ, ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఎస్ఐ అయ్యప్ప, ఇద్దరు కానిస్టేబుళ్ల, మరో ఇద్దరు హోం గార్డులను విఆర్‌కు బదిలీ బదిలీ చేశారు.ఆ ఏడుగురిపై వేదాయపాళెం పోలీస్టే షన్‌లో కేసు నమోదు చేయాలంటూ గుంటూరు ఐజి పాలరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

గంగాధర్‌రావు సిఐ వెంకటాచలం

అస్సాం రాష్ట్రానికి చెందిన గిరిజనుడు ఇమ్మానియేల్ తన భార్యతో కలిసి ఈ నెల 16వ తేదీన ట్రైన్‌లో కేరళకు ప్రయాణిస్తూ మార్గ మధ్యంలో వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో కొందరిపై దాడికి ఉపక్రమించాడు. ఈ నేపథ్యంలో కొందరు 112 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంకటాచలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇమ్మానియేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో నగరానికి తరలిస్తున్న తరుణంలో బుజబుజనెల్లూరు, పడారుపల్లి మార్గ మధ్యంలో తప్పించుకొని పారిపోయేందుకు ఒ వంతెన వద్ద వాహనం నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఇమ్మానియేల్‌ను వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. చికిత్స పొందుతూ ఇమ్మానియేల్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న గుంటూరు ఐజి పాలరాజ్ , ఎస్పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి శాఖ పరమైన విచారణ చేపట్టారు. విచారణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని నిర్ధారించారు.ఈ నేపథ్యంలో పోలీస్ సిబందిపై చర్యలు తీసుకున్నారు.

క్రీడలకు ప్రోత్సాహం : కాకాణి

ప్రజాశక్తి -నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని, అందులో భాగంగానే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను మంత్రి మంత్రి కాకాణి నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ లతో కలసి ప్రారంభించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన జిల్లా నెల్లూరు అన్నారు. నుడా ఛైర్మన్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ చొరవ తీసుకొని నగరంలో ఏపి స్టేట్ సబ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను నిర్వహించడం అభి నందనీ యమన్నారు. నుడా ఛైర్మన్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. సెట్నల్ సిఈఓ నాగరాజకుమారి, బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల కోసం 'ప్రజానాట్య మండలి'
ఘనంగా నగర కమిటీ 11వ మహాసభ -నూతన కమిటీ ఎన్నిక

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :కళ కళ కోసం కాదు.. కళ ప్రజల కోసం అనే నినాదంతో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న సంఘం ప్రజానాట్యమండలి అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శేషయ్య పేర్కొన్నారు. ఆదివారం బాలాజీనగర్‌లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లోని ఉన్నం బసవయ్య, కట్టా గోపాల్‌రెడ్డి ప్రాంగణంలో ప్రజానాట్యమండలి నగర కమిటీ 11వ మహాసభ నిర్వహించారు. తొలుత అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజానాట్యమండలి పతాక ఆవిష్కరణను సీనియర్ నాయకులు కె. ఏమేలు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శేషయ్య మాట్లాడుతూ దేశంలో జరిగిన అనేక కార్మిక, కర్షక పోరాటాలలో సాంఘిక ఉద్యమాలలో ప్రజానాట్యమండలి ఘనమైన పాత్ర పోషించిందన్నారు. కళారూపాలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు వీధి నాటకాలు, పాటలు, నత్యాలతో లౌకికవాదాన్ని, అభ్యుదయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. విష సంస్కతికి వ్యతిరేకంగా, మానవతా విలువలను కాపాడేందుకు కళా రంగంలో తమదైన ప్రత్యేక పాత్రను ప్రజా నాట్యమండలి పోషిస్తుందన్నారు. జిల్లాలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమం, అక్షరాస్యతా ఉద్యమం, భూ పోరాటాలు, కార్మిక వర్గ పోరాటాలలో ప్రజల గొంతుకై కళలను ప్రదర్శించిన సంఘం ప్రజానాట్యమండలి అని పేర్కొన్నారు. సాంకేతికంగా పెరుగుతున్న అభివద్ధిలో అశ్లీల చిత్రాలు, విష సంస్కతి వైపు యువత పెడ దోరణలు పడుతుందన్నారు. వాటికి భిన్నంగా, సమ సమాజ స్థాపన ధ్యేయంగా ప్రజానాట్యమండలి పనిచేస్తుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజానాట్య మండలి నూతన నగర కమిటీని 25 మందితో మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. నూతన నగర గౌరవాధ్యక్షులుగా పి.సూర్యనారాయణ, అధ్యక్షులుగా బొమ్మా. శ్రీధర్, కార్యదర్శిగా పి. వేణు, ట్రెజరర్ గా టి.నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఆఫీస్ బేరర్ కె.ఏమేలు, డాన్స్ మాస్టర్ కష్ణ, డప్పు కళా కారుడు పాల నారాయణ, కోలాట దళం, పండరి భజన కళారూపాల కళా కారు లు మహాసభ లో పాల్గొన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, నాయకులు ఆర్ శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు విజయ్ కుమార్, పెంచలయ్య, చిన్నరాజా ఉన్నారు.

నూతన అధ్యక్ష, కార్యదర్శులు బి శ్రీధర్, పి వేణు, గౌరవాధ్యక్షులు పి సూర్యనారాయణ

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- గుడ్లూరు : రోడ్డు దాటుతున్న ఎస్‌కె బాషా అనే వ్యక్తిని కారు ఢీకొనడంతో దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని తెట్టు దగ్గర ఆదివారం జరిగింది. తెట్టుకు చెందిన బాషా దర్గా లో ఉన్న భార్య, తన ఇద్దరు పిల్లల దగ్గరికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి హైదరాబాదు వెళ్తున్న కారు వేగంగా వచ్చే ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి కందుకూరు ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకి అప్పగించారు.

ఎస్‌టియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కందుకూరు :ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో లింగసముద్రం మండల కమిటీ సమావేశం జరిగింది. ఆ మండల ఎస్‌టియు నూతన అధ్యక్షులుగా నర్రా రామయ్య, కార్యదర్శిగా చాట్ల ప్రదీప్ రాజ్, ఆర్థిక కార్యదర్శిగా జి విజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. వారికి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సిహెచ్ ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి వై అశోక్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్స్ పి కిష్టయ్య, దేగ మహేష్, జోన్ కన్వీనర్ గద్దగుంట వెంకటేశ్వర్లు , వివి పాలెం మండల అధ్యక్షులు ఎస్ కే బాబు, లింగసముద్రం మండల మాజీ అధ్యక్షులు జాజుల మాధవరావు, ఉపాధ్యక్షులు టి అన్నమయ్య శుభాకాంక్షలు తెలిపారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి

ప్రజాశక్తి -రాపూరు : మణిపూర్‌లో కుకీ గిరిజన తెగకు చెందిన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను ఖండిస్తూ రైతు కూలీ సంఘం (ఆంప్ర), స్త్రీ విముక్తి సంఘటనల ఆధ్వర్యంలో రాపూరు పట్టణంలో ఆదివారం నిరసన ర్యాలీ జరిగింది. రైతు కూలీ సంఘం (ఆంప్ర) జిల్లా కార్యదర్శి జి సునీత కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అండతో జరిగిన ఈ సంఘటనకు నైతిక బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె అజిత, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి కొండమ్మ, అధ్యక్షురాలు ఆర్ రత్నమ్మ, రైతు కూలీ సంఘం నాయకులు ఆర్ సుబ్బరాయుడు, వివి.రమణయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి -రాపూరు : మండలంలోని తెగచర్ల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ ఆదివారం తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అక్కడ అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు గురించి సమాచారం అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేసే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. వేపినాపి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : తైక్వాండోలో ప్రకాశం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయిలో ఈ నెల 27,28,29 తేదీల్లో ఉత్తర్ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల విద్యార్థిని బి.ఎల్.అక్షర ఎంపికైంది. విజయ నగరంలో ఈనెల 15,16,17 తేదీల్లో జరిగిన అండర్-14 తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపింది. జిల్లాకు చెందిన బి.ఎల్.అక్షరను ఆదివారం ఎంఎల్ఎ మానుగుంట మహీధర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇస్తూ వారి మానసిక ఉల్లాసానికి తోడ్పడుతున్న ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కర రావు , కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు,డైరెక్టర్స్ బాల భాస్కర రావు, బెజవాడ నరేంద్ర బాబు,తైక్వాండో మాస్టర్ యస్‌కె అబ్దుల్ సలాం ఉన్నారు.

క్రీడాకారిణిని అభినందిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

అనారోగ్యంతోనే మృతిచెందారు..
జిజిహెచ్ ఘటనపై మంత్రి 'కాకాణి' స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో ఆక్సిజన్ అందక, వైద్యులు సరైన వైద్య సేవలు అందించలేకపోవడంతో ఆరుగురు రోగులు మతి చెందారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, వారందరూ పలు అనారోగ్య కారణాలతోనే మృతిచెందారని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని ఐ.సి.యు వార్డును మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సందర్శించారు. ఐసియు వార్డులో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. మంత్రి మీడియాతో మాట్లా డుతూ శనివారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో వసతులు లేక, ఆక్సిజన్ అందక, సరైన వైద్య సేవలు అందించలేక పోవడంతో ఆరుగురు రోగులు మతి చెందారని కొంతమంది పని గట్టుకొని ప్రచారం చేశారన్నారు. నిజానికి ఈ ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ స్వయంగా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను సందర్శించి మతుల కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడారన్నారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్, డిఎంహెచ్ఓ పెంచలయ్య, సూపరిం టెండెంట్ సిద్ధా నాయక్, డీసీహెచ్ఎస్ డా. రమేష్ నాథ్ ఉన్నారు.

జిజిహెచ్‌ని సందర్శించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మరమ్మతులకు నోచని 'రాళ్లపాడు' తూము
కాలువలోకి నీరు వృథా - సాగుదారుల ఆందోళన

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ తూము గేటు విరిగి నీళ్లు వృథాగా కాలువకు పోతున్నా ప్రాజెక్టు అధికారులు మరమ్మతులు చేపించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఎడవ కాలువ పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూము గేటు విరిగిపోవడం వల్ల నీరు కాలువకి వృథాగా పోతుందన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 12 అడుగుల నీటిమట్టం మేర నీరు ఉందన్నారు. వర్షాల సీజన్ ప్రారభం కావడంతో ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే అవకాశముందని, ప్రాజెక్టు నీళ్లు తక్కువ ఉన్నపుడే గేటు మరమ్మత్తు చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తూము గేటు విరిగి పడిగినప్పుడు తాత్కలికంగా పనులు చేశారు.గేటు విరిగిపడి చాలా రోజులవుతున్నా ప్రాజెక్టు అధికారులు విరిగిన గేటును తొలగించి మరో గేటు ఏర్పాటు చేయ కుండా కాలయాపన చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలో ప్రాజెకులోకి పూర్తి స్థాయిలో నీరు చేరితే ఎడమ కాలువ గేటు నుంచి నీళ్లు భారీగా కాలువకు వస్తాయని రైతులు ఆందోళన చెందుత ున్నారు. ప్రాజెక్టు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రాజెక్టు ఎడమ కాలువ తూము గేటును బిగించాలని ఎడమ కాలువ రైతులు కోరుతున్నారు.

గేటు విరిగిపోయిన దృశ్యం



నీరు వృథాగా పోతున్న దృశ్యం

జిజిహెచ్ ఘటనపై అధికారుల తీరు బాధాకరం : సోమిరెడ్డి

ప్రజాశక్తి - పొదలకూరు :నెల్లూరు జిజిహెచ్‌లో పేదలు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై అధికారులు వ్యవహరించిన తీరు బాధాకరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లా డారు. ఆస్పత్రిలో రోగులు ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణమనే ధోరణిలో మాట్లాడటం బాధాకరమనారు. పేదల ప్రాణాలంటే కలెక్టర్‌కు లెక్కలేదా అని ప్రశ్నించారు. మేజర్ ఇష్యూ జరిగితే పట్టుమని పది నిమిషాలు కూడా ఆస్పత్రిలో నిలబడలేరా! ఇంతకంటే మీరు చేసే రాచకార్యాలు ఏముంటాయని ఆయన ప్రశ్నించారు. కనీసం ఆ కుటుంబాలపై సానుభూతి కూడా చూపలేరా! అని అన్నారు. పెద్దాస్పత్రిలో జరిగిన ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాలని, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

తపాలా కార్యాలయంలో నిలిచిన లావాదేవీలు

ప్రజాశక్తి-గుడ్లూరు :గుడ్లూరు బ్రాంచి పోస్ట్ ఆఫీస్‌లో పరికరాలు పని చేయకుండా నిలిచిపోవడంతో గత నెల రోజులుగా లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో మరమ్మతులు చేయటానికి పనిచేయని పరికరాలను ఒంగోలు, కందుకూరు తరలించారు. అయినా పరికరాలను మరమ్మతులు చేయకుండా ఆపివేయడంతో స్థానిక తపాలా కార్యాల యంలో కార్యకలాపాలు స్థంభించిపోయాయి. ఫలితంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు రికరింగ్ డిపాజిట్లు, సుకన్య, యోజన తదితర పథకాలన్నీ నిలిచిపోయాయి. దీంతో ఖాతాదారులు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. పోస్టల్ వినియోగదారులు డబ్బు దాచుకోవాలన్నా అవస రానికి వినియోగిం చుకోవాలన్నా కందుకూరు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పం దించి స్థానిక పోస్టల్ కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ వినియోగదారులు కోరుతున్నారు.

మొరాయించిన ప్రింటర్

గుడ్లూరు కెనరా బ్యాంకులో ప్రింటర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులకి అకౌంటు బుక్కులు ఇవ్వకుండా ఆపేశారు. నగదు లావాదేవీలు గురించి అకౌంట్ బుక్ లో జమ కాకపోవడంతో విని యోగ దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులో ఉన్న ఏకైక ప్రింటర్ మరమ్మతులకు లోనై నెల రోజులు గడిచిపోయిన పనిచేయని ప్రింటర్ స్థానంలో నూతన ప్రింటర్ ఏర్పాటు చేయకపోవడంతో వేలాది మంది కెనరా బ్యాంకు వినియోగదారులు సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అవస్థలు పడు తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి ప్రింటర్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -పొదలకూరు : వెంకటాచలం సిఐ గంగాధర్‌పై చర్యలు తీసుకున్న ఐజీ, ఎస్పీలకు అభినందనలు తెలుపుతున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో ఆదివారం టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తోడేరు రెడ్డి రెండో సారి ఎంఎల్ఎ కాగానే పార్టీ కార్యాలయం ఉన్న భవన యజమానిని బ్లాక్ మెయిల్ చేసి ఒత్తిడి తెచ్చి మరీ ఖాళీ చేయించారన్నారు. ఇప్పుడు ఎంతో సౌకర్యవంతమైన భవనంలో కార్యాలయానికి అవకాశం ఇచ్చిన ఇంటి యజమానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెంకటాచలం పోలీస్టేషన్‌లో పరిధిలో అసోంకు చెందిన వ్యక్తి పోలీసులు పెట్టిన హింస భరించలేక జీపులో నుంచి దూకి ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఈ ఘటనకు సంబంధించి మంత్రి కాకాణి ఇలాకాలో సిఐని సస్పెండ్ చేస్తూ ఐజి, ఎస్పి చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, రావూరు రాధాకష్ణమ నాయుడు, మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, గుమ్మడి రాజాయాదవ్, గాలి రామకష్ణా రెడ్డి, బొద్దు లూరు మల్లికార్జున నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, పులిపాటి వెంకట రత్నం నాయుడు, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, కోవూరు బక్కయ్య నాయుడు ఉన్నారు.

ఎంఎల్‌సి 'కంచర్ల' పూజలు

ప్రజాశక్తి-కందుకూరు :కుప్పంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నూతనంగా నిర్మించే గహ నిర్మాణం శంకుస్థాపనలో ఆదివారం కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్; ఎంఎల్‌సి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పంలో తమ నేత నాయకుడు చంద్రబాబు నాయుడు సొంత ఇంటిని నిర్మించుకోవడం, ఆ ఇంటి నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి ఎస్ ఎం, మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసులు పాల్గొన్నారు.



యుసిసిని వ్యతిరేకిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలో భాగంగా యుసిసి అమలు చేయాలని ప్రయత్నిస్తుందని, దీనిని వ్యతిరేకించి దేశ ప్రజల ఐక్యతను కాపాడుకోవాల్సిన అవసరముందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం వేదాయపాళెం ప్రాంతంలోని మన్సూర్ భవన్‌లో సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం ఉమ్మడి పౌరసత్వ బిల్లును తీసుకొచ్చేదానికి, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే దానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలందరూ ఐక్యమై ఉమ్మడి పౌరసత్వ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వర్తమాన రాజకీయాలు జిల్లా సైన్స్ వేదిక నాయకులు వినయ్ బోధించారు. శిక్షణ తరగతులకు సిపిఎం రూరల్ నాయకులు సంపత్ కుమార్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య, సిపిఎం రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డి అబ్దుల్లా అజీజ్, కొండ ప్రసాద్ ఉన్నారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి మెడికల్ అసోసియేషన్, రవి హాస్పిటల్, కావలి రెడ్క్రాస్, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారి సహకారంతో జి.వంశీ, బి.శ్రీనాథ్, జి.హజరత్, ఐ.శివ రఘునాథ్, బి.భార్గవరాజ్, బి.అనీల్కుమార్, ఎస్ నరేష్, ఎమ్ సుజన్, టి.శివకుమార్, ఎమ్.క్రిష్ణ కిశోర్ దాతృత్వంతో కావలి పట్టణం శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో 52వ వైద్య శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ బి.అశోక్, డాక్టర్ సుధీర్, కుమార్రెడ్డిలు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కె సుబ్బారావు, డాక్టర్ పి శ్రీధర్, డాక్టర్ పి శివప్రసాద్, డాక్టర్ సుధీర్ కుమార్ రెడ్డి పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో సంయుక్త సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, మాలకొండయ్య, సంస్థ సభ్యులు ఎమ్.వి.ఎస్. ప్రసాద్ రావు, ఎమ్ అజిత్ బాబు, జి.కళ్యాణి, వివిధ స్వచ్చంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా, పి వి సాయి తేజ, నెల్లూరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నుండి కమయ్య, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని వాలంటీర్స్ సేవలు అందించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ కె సుబ్బారావు, డాక్టర్ పి శ్రీధర్, డాక్టర్ పి శివప్రసాద్, డాక్టర్ సుధీర్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందుతున్న బాధితులకు షుగర్ వ్యాధి నియంత్రణ, బిపి, తదితర వ్యాధులకు అవగాహన కల్పిస్తూ, వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పాల్గొని విజయవంతం చేసిన వైద్య సేవలు అందించినందుకు అందరికీ అభినందనలు తెలియజేశారు.

25న రాష్ట్రవ్యాప్త బంద్

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 25న మంగళవారం బంద్ నిర్వహిస్తున్నట్లు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు చింతకాయల శివకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వైసిపి ప్రభుత్వ తీరును నిరసిస్తూ, పలు డిమాండ్లతో ఈ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్, ఎఎస్ఎఫ్, పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐడిఎస్ఓ, సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడిగా రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వంలో చలనం తెచ్చేందుకు తలపెట్టిన బంద్ కు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

జనసేనకు మద్దతివ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : చిరంజీవి యువత, పవన్కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి మద్దతుగా పనిచేసి, పవన్కళ్యాణ్ను ప్రజల ఆకాంక్షల మేరకు కాబోయే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత వారు తీసుకోవాలని చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇన్ఛార్జి నళిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యువత అధ్యక్షులుగా భాను కిరణ్, పవన్కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులుగా డబ్బుకొట్టు నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గం ఇన్ఛార్జి నళిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి అసమర్థ అవినీతి ప్రజాకంటక పాలనపై జనసేనాని పవన్కళ్యాణ్ విమర్శలు చేస్తే తట్టుకోలేక కక్షపూరితంగా, ఏమీ పాలుపోక పవన్కళ్యాణ్ వ్యక్తిగత విషయాలపై విమర్శలకు దిగడం అత్యంత శోచనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు ఈగి సురేష్, జిల్లా నాయకులు కేతం రెడ్డి వినోద్రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మేకల ప్రవీణ్, నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లైన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం నగరపంచాయతీలో లైన్స్క్లబ్ నూతన అధ్యక్షుడు పైదా రవీంద్రబాబు, కమిటీ సభ్యుల నేతృత్వంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ భయ్యా రవికుమార్, డిఐ శరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పైదా రవి మాట్లాడుతూ మొక్కలు సకల జీవరాశులకు ప్రాణవాయువు అందించే ప్రదాతలని వాటిని ప్రతిఒక్కరూ విధిగా నాటాలని కోరారు. అనంతరం సాయంత్రం క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి పెద్దఎత్తున నూతన అధ్యక్షులు పైదా రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆయన నూతన గృహం నుండి పెద్ద ఎత్తున కారులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహానికి పూలమాల అవిష్కరించారు. అనంతరం టి.ఎస్.ఆర్.కళ్యాణమండపం లో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. టి.ఎస్.ఆర్. కళ్యాణ మండపంలో మాజీ కార్యవర్గ సభ్యులు సాంప్రదాయ బద్ధంగా మంగళ వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. తదుపరి టిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో లైన్స్క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పైదా రవీంద్రబాబు సెక్రటరీగా టి.సుధాకర్, ట్రెజరర్ బి.వెంకటేశ్వర్లు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నూడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, బుచ్చి నగరపంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజమురళి, లయన్స్ క్లబ్ ప్రముఖులు ఎస్ఐ వీర ప్రతాప్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు, అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో లైన్స్క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం

ప్రజాశక్తి-సంగం : మండలంలోని సిద్ధీపురం గ్రామంలోని ఎస్సి కాలనీలో అంబేద్కర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇటీవల దువ్వూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలనీకి చెందిన పవన్ క్యాజ్, మరో యువకుడు మధు మృతి చెందడంతో వారి జ్ఞాపకార్థం రెడ్క్రాస్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 30 మంది పైగా యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం ఇచ్చారు. రెడ్క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తం లేక ఇబ్బందులు పడుతున్న అనేక మందికి రక్తం అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు రక్తం అందిస్తున్నామన్నారు. సిద్ధీపురం, అంబేద్కర్ నగర్ యూత్ పాల్గొన్నారు.

ఆర్బికెలో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగం సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నమోదు, ఈ క్రాప్ బుకింగ్ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొలాల్లో ఏఎఓలు చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్ను స్వయంగా పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు సిసిఆర్సి కార్డులు తీసుకోవాలని, సిసిఆర్సి కార్డులపై ఎవరూ అపోహలు చెందొద్దన్నారు. పిఎంకిసాన్ పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

38వ వార్డులో జనంకోసం జనసేన

ప్రజాశక్తి-కావలి : స్థానిక 38వ వార్డులో జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. కావలి నియోజకవర్గ ఇన్ఛార్జ్ అలహరి సుధాకర్ ఆదేశాల మేరకు, కావలి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి సూచనల మేరకు వార్డు ఇన్ఛార్జ్ మన్నేపల్లి రిషికేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్, పాల్గొన్నారు.

కాలువ శుభ్రతపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి ప్రజలకు ఓ వరం లాంటి తాగునీరు సంజీవని వచ్చే కాలువను యువత పరిశుభ్రం చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కొండప్రాంతం చూసేందుకు వెళ్లే యువత కాలువను శుభ్రం చేయడం కొండపై నిల్వ ఉన్న తొట్టెను శుభ్రం చేయడం ఆ నీరే దిక్కుగా ఎదురుచూస్తున్న వారికి స్వచ్ఛమైన నీరును అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ కాలువ శుభ్రం చేయడానికి పంచాయతీ నుండి సిబ్బంది ఉండేవారని ఇప్పుడు వారు చొరవ చూపకపోవడంతో ఆ నీరును నమ్ముకున్న ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువను శుభ్రపరిచి స్వచ్ఛమైన తాగునీరును అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తహశీల్దారుగా నాగరాజు బాధ్యతలు

ప్రజాశక్తి-సంగం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతన తహశీల్దార్గా వై.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. సంగం తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న కోవూరుకు బదిలీ అయ్యారు. వెంకటాచలం నుండి నాగరాజును సంగంకు బదిలీ చేశారు.

3.4 లక్షల మందికి సామాజిక పింఛన్లు

డిఆర్డిఎ పిడి సాంబశివారెడ్డి

ముఖాముఖి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 3.4 లక్షల మందికి 16 రకాల సామాజిక పెన్షన్లు అందజేస్తుందని డిఆర్డిఎ పిడి సాంబశివారెడ్డి తెలియజేశారు. పలు కారణాలతో జిల్లాలో వేల సంఖ్యలో లబ్ధిదారులకు పెన్షన్ నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంతమంది లబ్ధిదారులకు పెన్షన్లు నిలిపివేస్తున్నారో డిఆర్డిఎ పిడి సాంబశివారెడ్డి మాటల్లో..

ప్రశ్న. జిల్లాలో ఎంతమంది లబ్ధిదారులకు పెన్షన్లు నిలిపివేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం నోటీసులు అందజేసింది. నోటీసులు అందు కున్న వారిలో ఎంత మంది ఆధారాలు చూపించి తమ పెన్షన్ను పునరుద్ధరించు కున్నారు..?

జవాబు. జిల్లాలో 3.4 లక్షల మంది 16 రకాలకు సంబంధించిన సామాజిక పెన్షన్లు అందజేస్తున్నాం. అయితే వివిధ కారణాల నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు 12 వేల మందికి పెన్షన్లు నిలిపివేస్తున్నట్లు డిసెంబరు నెలలో నోటీసులు అందించిన మాట వాస్తవమే. అయితే వీరిలో 8 వేల మంది లబ్ధిదారులకు పెన్షన్ పునరుద్ధరించడం జరిగింది. వీరందరికీ పెన్షన్ నగదు అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల పేరుతో పరిమితికి మించి ఇళ్లు ఉండటం, భూములు ఉన్నాయని, వాహనాలు కలిగి ఉన్నారని, నెలకు విద్యుత్తు వినియోగం 300 యూనిట్ల కంటే అధికంగా నమోదు కావడం వంటి కారణాలు ప్రభుత్వ రికార్డుల్లో గుర్తించడంతో అధికారులు నోటీసులు అందజేశారు. ప్రభుత్వం నుంచి నోటీసులు తీసుకున్న 12 వేల మందిలో 8 వేల మంది తమ పేరుతో నివాస గృహాలు, భూములు, వాహనాలు లేవని, విద్యుత్తు వినియోగం 300 యూనిట్లకంటే తక్కువగా వినియోగించుకుంటున్నామంటూ తగిన ఆధారాలు అధికారులు అందజేశారు. లబ్ధిదారులు చూపిన ఆధారాలను పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి పెన్షన్లు పునరుద్ధరించారు.

ప్రశ్న. ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ తీసుకొనేందుకు అనర్హులుగా ఎంతమందిని అధికారులు నిర్ధారించారు. వీరందరికీ ఎప్పటి నుంచి పెన్షన్ నిలిపివేస్తున్నారు..?

జవాబు. ప్రస్తుతానికి అధికారులు రికార్డులన్నీ నిశితంగా పరిశీలించి 2700 మంది పెన్షన్లు తీసుకొనేందుకు అనర్హులుగా గుర్తించారు. వీరందరికీ జనవరి నుంచి పెన్షన్లు నిలిపివేస్తున్నాం. నోటీసులు అందుకున్న మరి కొంతమంది లబ్ధిదారులకు సంబంధించిన ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులను పరిశీలిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేస్తాం. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుంది.

ప్రశ్న. ప్రభుత్వం కుంటి సాకులు చూపించి అవ్వాతాతలకు పెన్షన్ నిలిపివేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణల్లో ఎంత నిజం ఉంది. సరికొత్తగా పెన్షన్లు మంజూరు ఏమైనా చేశారా..?

జవాబు. అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుడికి పెన్షన్ అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందులో భాగంగా పెన్షన్ తీసుకొనేందుకు తాము అర్హులమంటూ దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి కొత్తగా 12,332 పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన వారికి పెన్షన్ ప్రభుత్వం నిలిపివేసిందంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు జనవరి నెల నుంచి అదనంగా మరో రూ.250 అందజేస్తున్నాం. పెంచిన పెన్షన్తో కలిపి ప్రతి నెలా వృద్ధులకు రూ.2750 ఒకటవ తేదీ ఉదయాన్నే ఇంటి వద్దకు తీసుకెళ్లి మరి అందజేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న. నూతన సంవత్సరం డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు..?

జవాబు. జిల్లాలో స్వయంసహాయక సంఘాల సభ్యుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పలు కార్యక్రమాలు చేస్తుంది. నూతన సంవత్సరం సరికొత్త కార్యక్రమాలు అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు పొట్టేలు పిల్లల పంపిణీ, పెరటి కోళ్ల పంపిణీ, పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపిస్తున్న సంఘం సభ్యులను ప్రోత్సాహిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి పొదుపు మహిళ అదనంగా రూ.10 వేల నుంచి రూ.15 వేలు సంపాదించు కొనేందుకు అనుకూలంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో షాపింగ్మాల్స్ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం.

మణిపూర్ ఘటనపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-సీతారామపురం

మణిపూర్లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత మూడు నెలల నుండి మైతే, కుకీ తెగలకు మధ్య మొదలైన హింసకాండల వల్ల 150మంది హత్య చేయబడ్డారని తెలిపారు. ప్రతిరోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, అనేకమంది కుకీ తెగకు చెందిన గిరిజనుల ఇళ్లను తగలబెట్టారన్నారు. ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధానమంత్రి కనీసం స్పందించకపోవడం చూస్తే మణిపూర్లో జరుగుతున్న హింసకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండలతోనే జరుగుతుందని ఆయన విమర్శించారు. తక్షణం మణిపూర్లో శాంతిని నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు. మే లో జరిగిన వీడియో బయటకు వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్ర పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు. కార్గిల్ అమరవీరుడి భార్యను వీడియోలో చూపిస్తున్నట్లుగా వివస్త్రను చేసి అత్యాచారం అనంతరం హత్య చేసిన ఘటనకు భారతదేశం తలదించుకునేలా ఉందని ఇందుకు ప్రధానమంత్రి సిగ్గుపడాలన్నారు. ఇలా బయటకు రాకుండా జరిగిన అనేక అఘాయిత్యాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గిరిజన ప్రాంతాలలోని ప్రజలకు హక్కులను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలు నేడు మతకలహాలుగా మారి చర్చీలను తగల బెడుతూ క్రిస్టియన్ పాస్టర్లను చంపుతున్నారని తెలిపారు. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బిజెపి హిందూత్వ ఎజెండాలో భాగంగానే జరుగుతుందన్నారు. గిరిజన భూములను మైతే ప్రజలకు ఇవ్వాలనే సాకుతో విలువైన ఖనిజాలు కలిగిన కొండ ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే దురుద్దేశంతోనే ఇటువంటి చర్యలను అరికట్టేందుకు ముందుకు రావడం లేదన్నారు. మానవత్వం లేని ప్రధానమంత్రిగా మోడీ మిగిలిపోతారని విమర్శించారు. అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకుని మణిపూర్లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నామ న్నారు. మేధావులు ప్రజాస్వామ్యవాదులు దేశ సమైక్యతను కోరుకునేవారు తక్షణం కేంద్ర ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బిజెపి ఆర్ఎస్ఎస్లు అమలు చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సిఐటియు నాయకులు కోడె రమణయ్య, చింతనబోయిన రత్తయ్య, అల్లూరు రెడ్డి, రామిరెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ముత్తుకూరు

విజయవాడలో 26వ తేదీన జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. ఆదివారం ముత్తుకూరు శ్రామిక భవనంలో సిఐటియు ఎపి జెన్కో కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గోడ భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కే.నాగరాజు, ఎపి జెన్కో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నక్కా శ్యాంప్రసాద్, జెన్కో నాయకులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి

కార్యకర్తలతో రూరల్ ఎంఎల్ఎ సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో నియోజకవర్గంలోని 18 గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలతో రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టకాలంలో ఎవరైతే తెలుగుదేశం పార్టీకి, తనకు అండగా ఉన్నారో వారికి తోడుగా తానుంటా అని తెలిపారు. ఈ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. అన్నింటికీ తెగించి, అన్ని రకాల ఇబ్బందులకు గురిచేస్తారని తెలిసి 17 నెలల అధికారాన్ని వదులుకొని బయటకి వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, రూరల్ మండల కన్వీనర్ పమజుల ప్రదీప్, పార్టీ రైతు రాష్ట్ర కార్యదర్శి సారంగం గున్నయ్య, మలినేని వెంకయ్య నాయుడు, ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, జిల్లా పరిషత్ కో – ఆప్షన్ సభ్యులు అల్లాభక్షు, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-కావలిరూరల్

కాంద్రా యువనేస్తం వ్యవస్థాపకులు కాంద్రా సతీష్ నాయుడు ఆధ్వర్యంలో నెల్లూరు మెడికవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో వైద్య బృందం ఆదివారం బంగారుపాలెం గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో కిడ్నీ, జనరల్, ఆర్థోకి సంబంధించిన డాక్టర్లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి కావలి నియోజకవర్గ ఇన్ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ కాంద్ర యువనేస్తం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కాంద్ర సతీష్ నాయుడు ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నచిన్న రోగాలకు దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంటుందన్నారు. కాబట్టి ఇటువంటి మెడికల్ క్యాంపును గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో తాను కూడా కావలి నియోజకవర్గంలో నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ వారి వైద్య బృందంతో కలిసి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాలిసెట్టి, టిడిపి సీనియర్ నాయకులు కోట వెంకారెడ్డి, కుర్రు కొండయ్య, కొండలరావు, సీనయ్య, రాజా, పోలయ్య, రవి, శేఖర్, బాలసత్యం, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై నిరసన

శాంతియుత నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-బిట్రగుంట

మణిపూర్ హింసాకాండపై, క్రైస్తవ గిరిజన మహిళలను వివస్త్రను చేసి నగ్నంగా ఒరేగించి అత్యాచారం చేసిన ఘటనపై ఆదివారం బోగోలు మండలం ఐక్య క్రైస్తవ సంఘం కాపర్ల ఆధ్వర్యంలో బోగోలు బజాజ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తిప్ప పోలీస్ స్టేషన్ వరకు శాంతియుతంగా నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బోగోలు మండల పాస్టర్, సంఘ కాపర్లు మాట్లాడుతూ క్రైస్తవ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేశారని, బిజెపి ప్రభుత్వంలో క్రైస్తవులపై దాడులు విపరీతంగా పెరిగాయని, దానిని యావత్ ప్రపంచం ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సాంసంగ్ బాబు, సిహెచ్ నాగరాజు, గంగాధర్, మండలంలోని క్రైస్తవ సోదరులు, పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మణిపూర్లో హింసాకాండపై మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనపై ఆదివారం క్రైస్తవ సోదరులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ నుండి క్రైస్తవులు వివిధ సంఘాలతో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను ఆపాలని వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్కు చేరుకున్నారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలిపి దళితులపై జరుగుతున్న అత్యాచారాలు అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ ఇలాంటి మారణ కాండలు జరగకుండా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సిఐ వి.గిరిబాబు, అన్ని సంఘాల క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్మోహన్రెడ్డి

ప్రజాశక్తి-కావలి

రాష్ట్రంలో మత్స్యకారులకు, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో పథకాలు అందజేస్తున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పేర్కొన్నారు. ఆదివారం ఆర్.ఎస్.ఆర్. కళ్యాణ మండపంలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కావలి నియోజకవర్గం మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కావలి నియోజక వర్గంలో మత్స్యకార కుటుంబాలకు తాను ఎంతో రుణపడి ఉన్నానన్నారు. అందుకే తాను ఎం.ఎల్.ఎ.గా ఉన్నపుడు 550మంది రొయ్యల సాగు చేస్తున్న మత్స్యకారులకు అప్పటి జిల్లా కలెక్టర్ కె.రాంగోపాల్ ద్వారా సాగు అనుమతులు ఇప్పించినట్లు గుర్తు చేశారు. తాను దాదాపు 30ఏళ్లపాటు టిడిపిలో పనిచేశానని తెలిపారు. తన నిజాయితీని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బి.సి.లకు సేవ చేసేందుకు వైసిపిలోకి రావాలని ఆహ్వానించారని, అందుకు తన స్నేహితులు విజయసాయిరెడ్డి తనకు సహకరించారన్నారు. అనంతరం తనను రాజ్యసభ సభ్యులుగా ముఖ్యమంత్రి నియమించారని తెలిపారు. తన ఆస్తులను కాపాడుకునేందుకు వైసిపిలో చేరానని అనుకోవడం సరికాదన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్కడ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే, కావలిలో రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డిని 3వ సారి ఎంఎల్ఎగా గెలిపించుకోవాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. అనంతరం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో మత్స్యకార నాయకులు గంగనగారి యాదగిరి, నాగనగారి శ్రీనివాసులు, కోమరి రాజు, ప్రళయకావేరి భాస్కర్, కొండూరు శ్రీనివాసులు, కె.గిరి. కోమరి శ్రీనివాసులు, ఎంపిటిసి శ్రీనివాసులు, తదితర మత్స్యకార నాయకులు, తీరప్రాంత మత్స్యకారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీద మస్తాన్ రావు

కోటపాడులో విద్యార్థుల వినూత్న నిరసన

- ప్లకార్డులతో మోకాళ్లపై విద్యార్థులు ఆందోళన
- ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని మహిమలూరు పంచాయతీలో ఉన్న హైస్కూల్కు వెళ్లడానికి రోడ్డు మార్గం కల్పించాలని ఆదివారం కోటపాడులోని సుమారు 15మంది విద్యార్థులు ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా ఆందోళన చేపట్టారు. సమస్యను పరిష్కరించాలని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న రోడ్డు వేయండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై తాము చాలా సంతోషంగా ఉన్నామని, వైసిపి పార్టీకి గ్రామస్తులు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు. అయితే ఎన్నో ప్రభుత్వాలు వచ్చిపోయాయని, కానీ తమ గ్రామానికి మాత్రం ఇప్పటివరకు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో, తాము ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. ఈ క్రమంలో గత పది సంవత్సరాల కాలంలో గ్రామానికి రోడ్డు లేని కారణంగా 20 కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాయని తెలిపారు. మాజీమంత్రి మేకపాటి గౌతమ్రెడ్డి తమ గ్రామంలో సందర్శనార్థం వచ్చినప్పుడు పెద్ద మనసుతో ప్రధాన సమస్య అయిన రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. ఆయన అకాల మరణంతో అప్పటి నుండి రోడ్డు ఏర్పాటు గురించి మాట్లాడే నాయకుడు గానీ అధికారి గానీ లేకపోవడం శోచనీయమ న్నారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని పలుమార్లు నాయకు లకు, అధికారులకు స్పందనలో అర్జీలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్రెడ్డి అయినా రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కోటంరెడ్డి సోదరులకు సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్రెడ్డిలను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో 41వ డివిజన్ నాయకులు, మాజీ ఇరుకళల అమ్మవారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు మెంబెర్ ఉచ్చురు సురేష్, ఇరుకళలల అమ్మవారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు మెంబెర్ కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, పరమేశ్వరి అవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబు, నాగేశ్వరరావు, మామిడాల మాల్యాద్రి, దువ్వూరు శ్వేతకర్ణ, మధు, చిత్తూరు హరి, షేక్ సికిందర్, షేక్ షఫీ, షేక్ హాఫిజ్, కొండపల్లి రమేష్, లక్ష్మయ్య వారి ఆధ్వర్యంలో 100 మంది కలిసి కోటంరెడ్డి సోదరులకు సంఘీభావం తెలియజేశారు.

యువకుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని వావిళ్ల గ్రామానికి చెందిన యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వావిళ్లకు చెందిన అమ్మాయితో అదేగ్రామానికి చెందిన వినయ్ కుమార్ చనువుగా ఉంటున్నాడు. అది గమనించిన అమ్మాయి అన్న విష్ణు, వినయ్ను మందలించాడు. దాంతో కొంతకాంగా వారిద్దరి మధ్య విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. విష్ణు అతని స్నేహితులు వారం రోజులు క్రితం వినయ్కుమార్పై దాడి చేశారు. దానిని మనసులో పెట్టుకున్న వినయ్కుమార్ ఆదివారం విష్ణుకు ఫోన్చేసి మాట్లాడుకుందాం రమ్మని పిలిచాడు. అప్పటికే వినయ్ అతని స్నేహితుడు హర్షవర్ధన్ ఒక రాడ్తో వేచి ఉన్నారు. చూరికత్తితో విష్ణు అక్కడికి చేరుకున్నాడు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం విష్ణు చూరికత్తితో వినయ్కుమార్ మెడపై పొడిచాడు. దాంతో వినయ్కుమార్ను 108 ద్వారా కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రయివేటు బస్సు బోల్తా..

ప్రజాశక్తి-సంగం

మండలంలోని అరవపాలెం వద్ద రేబాల కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు ఓ ప్రయివేట్ స్కూల్ బస్సు బోల్తా పడింది. నెల్లూరులో ఓ ఫంక్షన్ చూసుకుని తిరిగి ఆత్మకూరు వైపు వెళ్తూ అరవ-పాలెంలో సిబ్బందిని దించి కాలువ అంచునే వస్తుండటంతో ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సిబ్బందిని బస్సులో నుండి బయటకు తీసుకొచారు. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో బస్సులో ఉన్న సుమారు 30 మంది సిబ్బందికి పెను ప్రమాదం తప్పింది. పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలవడంతో బుచ్చి వైద్య శాలకు తరలించారు. మిగిలిన సిబ్బందిని సురక్షితంగా మరో వాహనంలో ఆత్మకూరుకు తరలించారు.

అధ్యాపకులకు అభినందనలు

ప్రజాశక్తి-కొడవలూరు

ఎన్బిఎ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) బృందం పరిశీలనలో అధ్యాపక బృందం ప్రదర్శించిన ప్రతిగా ఉందని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ కొనియాడారు. నార్తు రాజుపాలెంలో కళాశాల ఎన్.బి.ఎ టీం మూడ్రోజుల పరిశీలన పూర్తయిన సందర్భంగా ఆదివారం అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపక చైర్మన్ పెనుబల్లి బాబు నాయుడు, ప్రిన్సిపల్ పి.కుమార్ బాబు, తదితరులున్నారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, ముంగమూరు తోటలవద్ద ఉన్న సింహాద్రి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎయిడ్స్ ఆదరణ కేంద్రంలో ఆదివారం అక్కడ ఉన్న పేషెంట్లకు, అనాథలకు "నేనున్నాను చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో సింగంశెట్టి. పూర్ణ కుమార్ దాతృత్వంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా "నేనున్నా చారిటబుల్ ట్రస్ట్" చైర్మన్ దామిశెట్టి. తిరుమల కుమార్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టి.వి.ఎస్. మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదరణ కేంద్రంలో ఉన్న చిన్నారులకు భోజనవసతులు కల్పించడం చాలా మంచి పరిణామమని తెలియజేస్తూ, ఇటు వంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ ప్రజల మన్ననలను పొందాలని తెలియజేశారు. ముమ్ముందు అనేక సేవా కార్యక్రమాలు చేయడానికి ఈ నేనున్నాను చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వస్తుందని, కాబట్టి కావలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సంస్థకు చేయూత ఇవ్వాల్సిందిగా అభిలషించారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్ర డైరెక్టర్ కట్టెపల్లి.సింహాద్రి, టివిఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తోట.వెంకటేశ్వర్లు, సెక్రటరీ గాదిరెడ్డి హరినాథ్, ట్రస్ట్ మెంబర్ గాదిరెడ్డి మురళికృష్ణ, షేక్.బాబా ఫక్రుద్దీన్, సింగంశెట్టి.పూర్ణకుమార్, గాదిరెడ్డి రాజశేఖర్, రామలింగం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.